సాక్షి నల్లగొండ

మంగళవారం : 22 : అక్టోబర్ : 2024



మీరుంటానంటనే..

అధ్యాపకులంతా ఎంజీయూ క్వార్టర్స్‌లోనే ఉండాల వీసీ అల్తాఫ్ హుస్సేన్ ఆదేశించారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం : 590 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం	: 589.00 అడుగులు
ఇన్‌ఫ్లో	: 2,02,420 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 1,59,900 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 25,100క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 7,479 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 7,141 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం : 643.60 అడుగులు	
ఇన్‌ఫ్లో	: 753 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 753 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 41 క్యూసెక్కులు
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

పోలీస్ గ్రీవెన్స్‌లో వినతుల స్వీకరణ



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఎస్పీ

నల్లగొండ క్రైం : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌డేలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. భూ సమస్యలు, భార్య భర్తల మధ్య విభేదాలు, ఫైనాన్స్ సమస్యల పైన ఫిర్యాదులు వచ్చాయని.. పోలీస్‌స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వారి ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట పరంగా న్యాయం జరిగేలా పోలీసు అధికారులకు ఎస్పీ సూచించారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

నల్లగొండ రూరల్ : మండలంలోని దోమలపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌ను డీఈఓ భిక్షపతి సోమవారం తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న తరగతి గదులను పరిశీలించి వేగవంతంగా పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించి మంచి ఫలితాలను రాబట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

5కె రన్‌లో ఎన్జీ విద్యార్థికి ప్రథమ బహుమతి



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

రామగిరి(నల్లగొండ) : తెలంగాణ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి 5కె రన్‌లో ఎన్జీ కళాశాల బీఏ ఫైనల్ ఇయర్ విద్యార్థి వి.ధనుష్ ప్రథమ బహుమతి గెలుపొందాడని ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ తెలిపారు. త్వరలో గోవాలో జరిగే జాతీయ 10కె రన్‌కు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ప్రథమ బహుమతి కింద రూ.35 వేల చెక్కు, మెమెంటో అందజేసినట్లు తెలిపారు. సోమవారం ధనుష్‌ను కళాశాల సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ పరంగి రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పిల్లి సురేష్‌బాబు, సీటీఈ బి.నాగరాజు, పీడీ మల్లేశం, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ అనిల్ బొజ్జ, కోటయ్య, డాక్టర్ వెల్దండి శ్రీధర్, డాక్టర్ భట్టు కిరీటం, డాక్టర్ మునిస్వామి పాల్గొన్నారు.

డిసెంబర్ 3, 4 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : మిర్యాలగూడ డిసెంబర్ 3, 4 తేదీల్లో సీపీఎం జిల్లా 21వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి తెలిపారు. సోమవారం మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎర్రజెండా పేదలకు అండగా ఉంటుందన్నారు. నోట్ల రాజకీయాలు వచ్చిన ప్రస్తుత తరుణంలో మిర్యాలగూడలో జిల్లా మహాసభలను నిర్వహించడం ఎంతో ప్రాధాన్యం సంతరించుకుందన్నారు. ఇంటింటికి సీపీఎం కార్యక్రమాన్ని నిర్వహించి జిల్లా మహాసభల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి రాజకీయంగా చైతన్యపరచాలని కార్యకర్తలను కోరారు. డిసెంబర్ 2న 10వేల మందితో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాసభల విజయవంతం కోసం కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు తుమ్మల వీరారెడ్డి, లక్ష్మీనారాయణ, కందుల ప్రమీల, బండ శ్రీశైలం, సయ్యద్ పాషా, కూన్‌రెడ్డి నాగిరెడ్డి, వీరేపల్లి వెంకటేశ్వర్లు, జగదీశ్చంద్ర, రవినాయక్, పాండు, మంగారెడ్డి, వినోద్‌నాయక్, అయూబ్, సీతారాములు, అంజాద్, రామ్మూర్తి, సలీం, సత్తయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

20 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల



సాగర్ 20గేట్ల ద్వారా విడుదలవుతున్న వరద నీరు

నాగార్జునసాగర్: ఎగువ నుంచి నాగార్జునసాగర్‌కు వరద పెరిగింది. సాగర్ వద్ద 20రేడియల్ క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువ కృష్ణానదిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జునసాగర్ జలాశయానికి 2,02,420 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండటంతో అంతే నీటిని సాగర్ జలాశయంనుండి విడుదల చేస్తున్నారు. 20గేట్ల ద్వారా స్పిల్‌వేమీదుగా 1,59,900క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, విద్యుదుత్పాదన ద్వారా 25,100క్యూసెక్కులు మొత్తం కృష్ణానదిలోకి 1,85,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ, ఏఎమ్మార్పీ, వరద కాల్వలలకు 17,420క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 589 అడుగులున్నది. ఎగువ నుంచి వరద ప్రవాహం అధికంగా ఉండటంతో ముందుచూపుగా జలాశయాన్ని ఒక అడుగు ఖాళీగా ఉంచారు.

రూ.20 కోట్ల భూ కుంభకోణం

పంపకాల్లో తేడాతో.. వెలుగులోకి ప్రభుత్వ భూమి

- వివాదం పరిష్కారం కోసం వెళ్తే.. ఎదురైన కొత్త సమస్య
- 65 ఏళ్ల క్రితమే ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో నమోదు
- కొనుగోలుదారుల్లో కలవరం
- మిర్యాలగూడలో ముదిరిన పొలిటికల్ వార్



పంపకాల్లో తేడాలొచ్చిన స్థలం ఇదే

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : మిర్యాలగూడ నియోజకవర్గంలో ఇప్పుడు రాజకీయ రివేంజ్ కొనసాగుతోంది. ఎన్నడూ లేని విధంగా ప్రత్యర్థులను రాజకీయంగా సమాధి చేసేలా ఎత్తులు వేస్తున్నారు. అది కూడా అధికార కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగడం విశేషం. మిర్యాలగూడలో ప్రముఖ ప్రజాప్రతినిధికి ప్రత్యర్థి గ్రూప్‌లో ఆర్థిక విభేదాలు కలిసి వచ్చాయి. దాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయంగా ఇబ్బంది పెట్టాలని చూడగా సుమారు రూ.20 కోట్ల విలువైన భూ కుంభకోణం వెలుగులోకి వచ్చింది.

పది గుంటల ప్రభుత్వ భూమి..

మిర్యాలగూడ పట్టణంలోని ప్రముఖుల మధ్య భూ వివాదం చినికిచినికి గాలివానలా మారి 65 సంవత్సరాల క్రితం జరిగిన భూ కుంభకోణం బయటపడింది. మిర్యాలగూడ పట్టణంలోని సాగర్‌రోడ్డుపై సర్వే నంబర్ 992లో సుమారు పదిగుంటల భూవివాదం పరాకాష్టకు చేరింది. భూమి అమ్మకాల విషయంలో ఎంపీ ఎన్నికల సమయంలో అధికార పార్టీలో చేరిన పదవిలో ఉన్న ప్రముఖుడు, మరో ఇద్దరి మధ్య వివాదం చెలరేగింది. సదరు భూమిలో తన 35శాతం వాటా అమ్మితే రూ.15 కోట్లు ఇవ్వాలని, లేదా.. మీ చేతిలో ఉన్న 65 శాతం భూమి అమ్మితే రూ.9కోట్లు ఇస్తానని పేచీ పెట్టడంతో విసిగిపోయిన ఇద్దరు.. ప్రధాన ప్రజాప్రతినిధిని ఆశ్రయించారు. ఆ భూమి గత వివరాలు తెలుసుకునే పనిలో భాగంగా పహాణీ తీయడంతో ఆ భూమి కాస్తా ఆబాది గ్రామ కంఠం భూమిగా తేలింది. 1977–78లో గ్రామ కంఠం భూమిగా నమోదు కావడం, అందులో 8.38 ఎకరాల భూమి ఆబాది (గ్రామకంఠం)లోనిదిగా తేలింది. దీంతో మున్సిపల్ అధికారులు ఈ నెల 19న ఆ భూమి కొనుగోలు చేసిన వ్యక్తులకు నోటీసులు జారీచేశారు. నోటీసులు అందిన వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని, లేకుంటే స్వాధీనం చేసుకుంటామని అందులో పేర్కొన్నారు.

డాక్యుమెంట్లను పరిశీలిస్తాం

మిర్యాలగూడ సర్వే నంబర్ 992లో సుమారు పది గుంటల భూమి మీకు ఎలా వచ్చిందో చెప్పాలని కొనుగోలుదారులకు నోటీసులు ఇచ్చిన మాట వాస్తవమే. ఏడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని కోరాం. కొనుగోలుదారులు ఒక్కరోజులోనే సమాధానం ఇచ్చారు. వారిచ్చిన సమాధానం, డాక్యుమెంట్లు, ఆధారాలను ఉన్నతాధికారులకు సమర్పించాం. ఆ డాక్యుమెంట్లను పూర్తిస్థాయిలో పరిశీలిస్తాం

– వెంకన్న, మున్సిపల్ డీఈ

రాజకీయ విభేదాలతో వెలుగులోకి..

ఈ భూ కుంభకోణం బయటికి రావడానికి అధికార పార్టీ నేత హస్తం ఉందని, ఇందుకు రాజకీయ విభేదాలు కూడా కారణమని తెలుస్తోంది. చట్టసభలో ఉన్న ప్రతినిధిని బాధితులు ఆశ్రయించడంతో ఈ బాగోతం వెలుగులోకి వచ్చిందని సమాచారం. మొత్తం మీద 65 సంవత్సరాల క్రితం ఆ భూమిలో అప్పటి పట్టణ మున్సిపల్ చైర్మన్ నివాసం ఉండి ఆయన మున్సిపాలిటీ తరఫున షాపులు నిర్మించి అద్దెకు ఇచ్చారు. ఆయన మరణించిన అనంతరం ఆ స్థలాన్ని అమ్మేశారు. ఇప్పటివరకు నాలుగైదు చేతులు మారాయి. ప్రస్తుతం పొత్తులో ఉన్న స్థలాన్ని తాత్కాలికంగా అద్దెకిచ్చారు. ఆ అద్దెలను కూడా పట్టణ ప్రజాప్రతినిధి తీసుకోవడంతో వారిలో ఆర్థిక వివాదం మరింత పెరిగింది. ఇప్పుడు ఆ భూమి కొనుగోలుదారుల్లో కలవరం మొదలైంది.

శాంతిభద్రతలతోనే అభివృద్ధి

- విధి నిర్వహణలో ప్రాణాలు ఫణంగా పెట్టిన పోలీసులకు నా సెల్యూట్
- పోలీస్ అమరుల సంస్మరణ దినోత్సవంలో మంత్రి కోమటిరెడ్డి



పోలీస్ అమరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎస్పీ తదితరులు

నల్లగొండ క్రైం : శాంతిభద్రతలు పటిష్టంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో అమర వీరుల స్థూపం వద్ద కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్రపవార్‌లతో కలిసి మంత్రి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతూ విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేస్తున్న పోలీసులకు సెల్యూట్ అన్నారు. పోలీస్‌స్టేషన్లు అంటే భయపెట్టే కేంద్రం కాదని, బాధలు తీర్చేవన్నారు. జిల్లాలో 15 మంది అమరులయ్యారని వారి కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఒకొక్కరికి రూ.25 వేల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. వారి పిల్లల ఉన్నత చదువులకు అండగా ఉంటామన్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ దేశ పాలనా వ్యవస్థలో పోలీసుల వ్యవస్థ వెన్నెముక లాంటిదన్నారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు పోలీసులు చేస్తున్న కృషికి తన సహకారం ఉంటుందన్నారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ విధి నిర్వహణలో జిల్లాలో 1991 నుంచి 2024 వరకు 15 మంది పోలీసులు అమరులయ్యారని తెలిపారు. అంతకు ముందు పోలీసుల నుంచి మంత్రి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, ఏఎస్పీ రాములునాయక్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జెడ్పీటీసీలు లక్ష్మయ్య, చిట్ల వెంకటేశంగౌడ్ తదతరులు పాల్గొన్నారు.



అమరులకు నివాళులర్పిస్తున్న పోలీసులు

సీసీఐ కొనుగోళ్లపై రెవెన్యూ అధికారుల ఆరా

మునుగోడు : మునుగోడు మండలంలోని జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లపై రెవెన్యూ అధికారులు సోమవారం ఆరా తీశారు. వారం రోజుల క్రితమే సీసీఐ కేంద్రాలు ప్రారంభించి రైతులకు మద్దతు ధర చెల్లించాలని కలెక్టర్ ఆదేశించినప్పటికీ కొనుగోళ్లు ప్రారంభించకపోవడంపై ‘సాక్షి’లో ‘పత్తి రైతుల పరేషాన్’ శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం ఆర్‌ఐలు రామచంద్రయ్య, నాగరాజు జిన్నింగ్ మిల్లుల వద్దకు వెళ్లి కొనుగోళ్లు ఎందుకు చేయడం లేదనే వివరాలని సేకరించారు. పత్తిలో తేమశాతం అధికంగా ఉండటం వల్ల సీసీఐ ఇన్‌చార్జి కొనుగోళ్లు ప్రారంభించలేదని, దీపావళి తరువాత మొదలు పెట్టాలని తమతో చెప్పారని.. మిల్లుల యజమానులు రెవెన్యూ అధికారులకు తెలియజేశారు. పత్తి కొనుగోళ్లపై తయారు చేసిన నివేదికను తహసీల్దార్ ద్వారా కలెక్టర్‌కు అందచేయనున్నట్లు తెలిపారు.



కొంపల్లిలోని మిల్లులో పత్తిని పరిశీలిస్తున్న ఆర్‌ఐ

పవర్‌ప్లాంట్ నిర్వాసితులకు ఉద్యోగాలు

- సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్



మాట్లాడుతున్న అమిత్ నారాయణ్

మిర్యాలగూడ : దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలో యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ నిర్మాణంలో భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగాలు కల్పించే ప్రక్రియ చేపట్టినట్లు సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ తెలిపారు. సోమవారం పట్టణంలో తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవర్ ప్లాంట్‌లో 169 మంది ఇళ్లు కోల్పోయారని, వారందరికీ పరిహారం అందించడంతోపాటు రిహాబిటేషన్ సెంటర్లకు తరలించామన్నారు. భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితుల్లో తొలుత ఇళ్లు కోల్పోయిన 169 కుటుంబాల్లో తొలి విడతగా 133 మందికి ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. కుటుంబంలో ఎవరికి ఉద్యోగం ఇవ్వాలో.. కుటుంబ సభ్యులంతా ఏకాభిప్రాయంతో అంగీకార పత్రం, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను ఈనెల 22 నుంచి వారం రోజుల పాటు దామరచర్ల తహసీల్దార్‌కు అందజేయాలని సూచించార. విద్యార్హతలను బట్టి పవర్ ప్లాంట్ అధికారులు ఉద్యోగ అవకాశం కల్పిస్తారని తెలిపారు. ఇండ్లు కోల్పోయిన, భూనిర్వాసితులకు రెండో విడతలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పవర్‌ప్లాంట్ ఈఈ జయరాంరెడ్డి, తహసీల్దార్లు హరిబాబు, జవహర్‌లాల్, కార్యాలయ డీఏఓ శ్రీనివాస్‌శర్మ ఉన్నారు.

అధ్యయనానికి నల్లగొండ చక్కటి వేదిక



కలెక్టర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సెంట్రల్ సర్వీసెస్ ప్రొబేషనరీ అధికారులు

- కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ : అభివృద్ధి, సంక్షేమ పథకాల అధ్యయనానికి నల్లగొండ జిల్లా చక్కని వేదిక అని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సంక్షేమ కార్యక్రమాలపై అధ్యయనం నిమిత్తం నల్లగొండకు వచ్చిన 21 మంది ఆల్ ఇండియా సర్వీసెస్, సెంట్రల్ సర్వీసెస్ ప్రొబేషనరీ అధికారుల బృందంతో కలెక్టరేట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వ్యవసాయం ప్రధాన జీవనాధారమని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. అధికారుల బృందం అధ్యయనానికి అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. జిల్లాలో ప్రజల జీవన విధానం, సామాజిక, ఆర్థిక పరిస్థితులు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను అధ్యయనం చేయవచ్చని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఏఓ శ్రవణ్, ఉద్యాన శాఖ అధికారి సాయిబాబా, జిల్లా పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ జి.కోటేశ్వరరావు, గృహ నిర్మాణ పీడీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

జర్పులతండాలో పర్యటన

చింతపల్లి : చింతపల్లి మండల పరిధిలోని జర్పులతండాలో సోమవారం సివిల్ సర్వీసెస్ ప్రొబేషనరీ అధికారుల బృందం పర్యటించింది. గ్రామంలో ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలను అధికారులు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మరో నాలుగు రోజుల పాటు గ్రామంలోనే పర్యటిస్తామని తెలిపారు.

‘ధరణి’ అక్రమ పట్టాలు రద్దు

- రూ.8కోట్ల విలువైన భూములు స్వాధీనం



మిర్యాలగూడ : ధరణిలో జరిగిన అక్రమాలపై అధికారులు దృష్టి సారించారు. విలువైన భూములను కాజేసేందుకు ధరణిలో నమోదు చేయించుకుని పట్టాలు పొందిన వారి వివరాలను వెలికితీస్తున్నారు. దామరచర్ల మండలం కొత్తపల్లి గ్రామ రెవెన్యూ పరిధి తాళ్లవీరప్పగూడెం శివారులో 23.37 ఎకరాల సీలింగ్ భూమిపై ఉన్న పట్టాలను రద్దు చేసి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ భూముల విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.8 కోట్లు ఉంటుందని తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం దామరచర్ల తహసీల్దార్ జవహర్‌లాల్ వెల్లడించారు. యాదాద్రి పవర్‌ప్లాంట్‌కు సమీపంలో తాళ్ల వీరప్పగూడెం వద్ద సర్వే నంబర్ 66లో 15.08ఎకరాలు, సర్వే నంబర్ 67లో 8.29 ఎకరాలు మొత్తం 23.37 ఎకరాల భూమి జాబిశెట్టి శేషమ్మ పేరుతో ఉండగా 1997లో సీలింగ్ యాక్ట్ ప్రకారం పట్టాదారు నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఈ భూములపై నిబంధనలకు విరుద్ధంగా పట్టాలు పొందినట్లు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదులు అందడంతో అధికారులు విచారణ జరిపారు. సర్వే నంబర్ 67లో 8.29 ఎకరాలు, సర్వే నంబర్ 66లో 12.39 ఎకరాలకు అక్రమంగా పట్టాలు పొందినట్లు గుర్తించారు. ఈ భూములను అంబటి రామాంజనేయులు 6 ఎకరాలు, వింజం ముసలయ్య 5.29 ఎకరాలు, సాధినేని శ్రీనివాస్‌రావు 2.25 ఎకరాలు, రాయికింది దివ్య 3 ఎకరాలు, నాలావత్ కమిలి 3 ఎకరాలు, ఇండియా సిమెంట్స్ 1 ఎకరం పట్టా పొందారు. ఈ పట్టాలను రద్దు చేస్తున్నామని, భూములను స్వాధీనం చేసుకుంటున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ రెవెన్యూ గ్రామ పరిధిలో వివిధ సర్వే నంబర్లలో 120 ఎకరాల సీలింగ్ భూమి ఉందని.. ధరణి అమలు కాగానే పలువురు అక్రమంగా పట్టాలు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయని.. వీటన్నింటిని కూడా సమగ్రంగా విచారణ జరుపుతున్నట్లు అధికారుల వెల్లడించారు.

పత్తికి మద్దతు ధర అందిస్తాం

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు : పత్తికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందేలా చూస్తామని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మునుగోడులోని కార్తికేయ కాటన్ మిల్లులో ఏర్పాటుచేసిన సీసీఐ కొనుగోళ్ల కేంద్రాని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని జిన్నింగ్ మిల్లుల్లో దశలవారిగా సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. నిబంధనల ప్రకారం తేమశాతం ఉండేలా చూసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ వేణుగోపాల్, చండూరు మార్కెట్ కార్యదర్శి రవి, చండూరు సీసీఐ కొనుగోల కేంద్రం ఇన్‌చార్జి బాలచందర్ నీమ్‌జా, ఆర్‌ఐ నాగరాజు, ఏఈఓ నర్సింహ, మాజీ జెడ్పీటీసీ జాజుల అంజయ్యగౌడ్, మాజీ ఎంపీపీలు పాలగోని సత్యంగౌడ్, కర్నాటి స్వామి, మాజీ సర్పంచ్‌లు మిర్యాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



సీసీఐ కేంద్రాని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ : ప్రజావాణి ఫిర్యాదులు జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజల నుంయి ఆయన ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడారు. ఫిర్యాదులు ఇచ్చిన వెంటనే కలెక్టర్ సంబంధిత అధికారులను దగ్గరకు పిలిపించి అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ మున్సిపల్, గ్రామీణ ప్రాంతాల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. సామాజిక, ఆర్థిక సర్వేకు ఎన్యుమరేటర్లను వెంటనే గుర్తించాలని సూచించారు. ఈ అంశాలపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై దృష్టి పెట్టాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు, సవరణపై దృష్టి పెట్టాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆర్డీఓలను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్డీఓలతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు జాబితా సవరణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఎంఈఓల ద్వారా అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో మాట్లాడి అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా చూడాలన్నారు. రెండు రోజుల్లో ఓటరు అవగాహన కార్యక్రమాలపై జిల్లాస్థాయి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా పరిషత్ సీఈఓ, స్వీప్ నోడల్ అధికారి ప్రేమ్‌కరణ్‌రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, ఆర్డీఓలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డిగ్రీ ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

నల్లగొండ రూరల్: డిగ్రీ సెమిస్టర్ ఫీజు చెల్లింపు గడువును ఈ నెల 28వ తేదీ వరకు పొడిగించినట్లు మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఉపేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా ఈ నెల 30వ తేదీ వరకు అపరాధ రుసుముతో ఫీజు చెల్లించవచ్చన్నారు.

మద్యం సీసాలు, నాటుసారా ధ్వంసం



మద్యం సీసాలు, నాటుసారాని ధ్వంసం చేయిస్తున్న ఎక్సైజ్ అధికారులు, పోలీసులు

గరిడేపల్లి: గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సమయాల్లో 48 కేసుల్లో పట్టుబడిన మద్యం సీసాలను, నాటుసారాని సూర్యాపేట జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనుమతితో సోమవారం గరిడేపల్లి మండల కేంద్రంలో హుజూర్‌నగర్ ఎక్సైజ్ ఎస్‌ఐ వెన్నెల, ఎస్‌ఐ నరేష్ సమక్షంలో ధ్వంసం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

కట్టంగూర్: విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతిచెందాయి. ఈ ఘటన కట్టంగూర్ మండల కేంద్రంలోని అంబటివాగులో సోమవారం జరిగింది. అంబటివాగుకు చెందిన ముదిరెడ్డి భద్రమ్మ రోజుమాదిరిగానే సోమవారం కూడా తన రెండు గేదెలను మేత మేపేందుకు తోలుకెళ్తోంది. ఈ క్రమంలో బీసీ హాస్టల్ సమీపంలో అప్పటికే తెగిపడి ఉన్న విద్యుత్ తీగకు కరెంట్ సరఫరా కావటంతో గేదెలు ఆ తీగను తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాయి. మృతి చెందిన గేదెల విలువ సుమారు రూ.1.20లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరుతోంది.

బైకులు చోరీ చేస్తున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపుతున్న పోలీసులు

భువనగిరి క్రైం: బైక్‌లు చోరీ చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి ఏడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. భువనగిరి పట్టణ ఎస్‌ఐ సుధీర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం కంచెర్ల గ్రామానికి చెందిన కొక్కు గణేష్ నంబర్ ప్లేట్ లేని బైక్‌పై సోమవారం భువనగిరి వైపు వస్తుండగా.. భువనగిరి పట్టణంలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు అతడిని ఆపేందుకు ప్రయత్నించారు. కానీ అతడు బైక్‌ను ఆపకుండా పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు పట్టుకుని విచారించారు. ఈ విచారణలో భాగంగా గణేష్ పలు ప్రాంతాల్లో ఏడు బైక్‌లను దొంగిలించాడని, దొంగిలించిన బైక్‌లను తన అత్తగారి ఊరైన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం గారకుంటపాలెం గ్రామంలో దాచిపెట్టినట్లు వెల్లడించాడు. గారకుంటపాలెం నుంచి ఏడు బైక్‌ను స్వాధీనం చేసుకుని గణేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పది రోజుల్లో వెల్లెంల ప్రాజెక్టు నింపుతాం

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన

నల్లగొండ రూరల్: మరో 10 రోజుల్లో బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు నింపుతామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ మండలం ఖాజీరామారంలో రూ.20లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బి.వెల్లెంల కాల్వ ద్వారా చెరువులు నింపుతామన్నారు. కాలువలు తవ్వేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా గ్రామంలో మౌలిక వసతుల ఏర్పాటుకు రూ.10లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఖాజీరామారం గ్రామానికి గతంలో బీటీ రోడ్డు, సబ్ స్టేషన్ నిర్మించానని, డీ–39 కాల్వలో కంపచెట్లు తొలగించి దిగువకు నీరు వెళ్లే విధంగా చేశానన్నారు. నల్లగొండ నియోజకవర్గానికి నాలుగు వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని ఇందులో ఖాజీరామారం గ్రామానికి 50 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గ్రామ పంచాయతీ భవనంపై మరో అంతస్తు నిర్మించేందుకు ఎమ్మెల్యే నిధుల నుంచి మరో రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని పట్టించుకోలేదని తాను ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు మంజూరు చేయించానని, 24 నెలల్లో సొరంగాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రూ.కోటితో పావురాలగూడేనికి రహదారి మంజూరు చేశామన్నారు. ఖాజీరామారం పాఠశాలను మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ షబ్బీర్‌బాబా, ఆర్డీఓ శ్రీదేవి, జిల్లా పంచాయతీ అధికారి మురళి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ సత్యనారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య, పాశం రాంరెడ్డి, నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ ఎంపీపీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.



ఖాజీ రామారంలో గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి



మాడ్గులపల్లిలో గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి



ఖాజీరామారంలో బైక్‌పై వెళ్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

పేదల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

వేములపల్లి(మాడ్గులపల్లి): రాష్ట్రంలోని పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి అభివృద్ధికి కృషి చేస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మాడ్గులపల్లి మండల కేంద్రంలో రూ.50లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన కేవలం పది నెలల్లోనే రైతు రుణమాఫీ చేశామని, ఇంకా పెండింగ్ ఉన్న వారికి డిసెంబర్ 9వ తేదీ లోపు పూర్తి చేస్తామన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం లక్షల కోట్ల అప్పులు తీసుకొచ్చారని, వాటికి వడ్డీలు కట్టడమే కాంగ్రెస్ ప్రభుత్వానికి సరిపోతుందన్నారు. మాడ్గులపల్లి మండల కేంద్రంలో మూడెకరాల ప్రభుత్వ స్థలంలో ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ నిర్మాణాలు త్వరలో చేపడతామని అన్నారు. మాడ్గులపల్లి–మామిడాల వరకు డబుల్ రోడ్డు పనులను ప్రారంభించామని అదే విధంగా చిరుమర్తి–సూర్యాపేట వరకు త్వరలో డబుల్ రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, ఎంపీడీఓ స్వామి, తహసీల్దార్ పద్మ, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, మాజీ జెడ్పీటీసీ పుల్లెంలల సైదులు, మండల పార్టీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, నరసింహ, సైదిరెడ్డి, వెంకన్న, పురుషోత్తంరెడ్డి, నరేష్, యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మీరుంటానంటేనే క్వార్టర్స్ నిర్మించాం

- నేను యూనివర్సిటీలోనే ఉంటాను.. మీరూ ఉండాల్సిందే
- ఎంజీయూ అధ్యాపకులను ఆదేశించిన వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ రూరల్: 'మీరుంటానంటేనే గతంలో నేను ఇక్కడ వీసీగా ఉన్న సమయంలో క్వార్టర్స్ నిర్మాణం చేశాను.. నేను ఇక్కడే ఉంటాను.. మీరు కూడా ఇక్కడే ఉండాల్సిందే' అని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్ అధ్యాపకులను ఆదేశించారు. సోమవారం యూనివర్సిటీలో అధ్యాపకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంజీయూకి న్యాక్ ఏ గ్రేడ్ వచ్చేలా అధ్యాపకులంతా సమష్టిగా కృషి చేయాలని అన్నారు. అధ్యాపకులు ప్రతి విద్యార్థిని విజ్ఞానవంతుడిగా తయారుచేసి జాతీయ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు సమయపాలన పాటించాలని అందుకోసం బయోమెట్రిక్ అమలు చేయాలన్నారు. 75శాతం హాజరుంటేనే విద్యార్థులను పరీక్షలకు అనుమతించాలన్నారు. ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ మూల్యాంకనాలు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అధ్యాపకులు యూనివర్సిటీ క్వార్టర్స్‌లో ఉండకుండా హెచ్‌ఆర్ తీసుకోవడమేంటని ప్రశ్నించారు. విద్యార్థులు హాస్టళ్లలో ఉండకుండా తరగతులకు హాజరయ్యేలా అధ్యాపకులే పర్యవేక్షించాలన్నారు. కచ్చితమైన పరిశోధనలు జరగాలని, ఏజెన్సీల దగ్గర పరిశోధనా పత్రాలు తెచ్చిన వారికి పీహెచ్‌డీ పట్టాలు ఇవ్వవొద్దన్నారు. యూనివర్సిటీని మరింత అభివృద్ధి చేసేందుకు మరిన్ని సంస్కరణలు తీసుకుంటామన్నారు. గతంలో తాను వీసీగా సమర్థవంతంగా పనిచేసిన కారణంగానే మరోసారి తనకు వీసీగా అవకాశం వచ్చిందన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ రవి, ఓఎస్‌డీ అంజిరెడ్డి, ప్రిన్సిపాల్స్ అరుణప్రియ, సుధారాణి, ఎంవీఎస్ రెడ్డి, ప్రేమ్‌సాగర్, డీన్‌లు సరిత, వసంత, రేఖ, రవి, రమేష్, మాధురి, మద్దిలేటి, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధ్యాపకులతో సమావేశమైన ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్

ఇంటి ముందు నిలిపిన కారు చోరీ

మిర్యాలగూడ అర్బన్: ఇంటి ముందు పార్కింగ్ చేసిన కారును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని నందిపాడు బైపాస్ సమీపంలోని వైన్స్ పక్క వీధిలో సోమవారం ఉదయం జరిగింది. బాధితుడు రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే ఆదివారం తన స్విఫ్ట్ డిజైర్ కారులో బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన రామాంజనేయులు ఇంటి ముందు కారును పార్కింగ్ చేశాడు. సోమవారం ఉదయం లేచి కారును శుభ్రం చేసి ఇంట్లోకి వెళ్లాడు. అనంతరం ఉదయం 10:30 గంటలకు ఇంటి బయటకు వచ్చి చూస్తే కారు కనిపించలేదు. చుట్టుపక్కల ఎంత వెతికినా కారు కనిపించకపోవడంతో మిర్యాలగూడ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గుర్తుతెలియని వ్యక్తులు కారును తీసుకెళ్తున్న దృశ్యాలు పక్కనే ఉన్న వైన్ షాపు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు పేర్కొన్నారు.

రాజానగరంలో విషాదఛాయలు

ఆలేరురూరల్: ఆలేరు మండలం రాజానగరం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన జగ్గరాజు వెంకటేశ్‌రాజు(20) ఆంధ్రప్రదేశ్‌లోని గన్నవరం సమీపంలో గల లింగయాస్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం స్నేహితులతో కలిసి సమీప గ్రామమైన మాదల దారిగుడెం చెరువులో స్నానం చేసేందుకు వెళ్లిన వెంకటేశ్‌రాజు నీటి మునిగి మృతిచెందాడు. మృతదేహానికి గన్నవరం ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు.



వెంకటేశ్‌రాజు (ఫైల్)

ప్రమాదవశాత్తు చెరువులో మునిగి వ్యక్తి మృతి

మునగాల: మండలంలోని ఆకుపాముల గ్రామంలో సోమవారం ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఓ వ్యక్తి మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకుపాముల గ్రామానికి చెందిన పచ్చిపాల కోటయ్య(45) వ్యవసాయ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తన గేదెను మేపేందుకు గ్రామ శివారులోని కాముకుంట చెరువు వద్దకు వెళ్లాడు. గేదె చెరువు లోపలకు వెళ్లి బయటకు రాకపోవడంతో కోటయ్య ఈత కొట్టుకుంటూ చెరువు మధ్యలోకి వెళ్లాడు. ఈ క్రమంలో తన లుంగీ కాళ్లకు చుట్టుకోవడంతో నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. చెరువు పరిసర ప్రాంతాల్లో ఉన్న పలువురు గమనించి గ్రామంలోకి వచ్చి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. చెరువు వద్దకు చేరుకున్న గ్రామస్తులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి నీటిలో మునిగి ఉన్న కోటయ్య మృతదేహాన్ని బయటకు తీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రయాణికురాలి బ్యాగు చోరీ

- సీసీ కెమెరాల సహాయంతో బ్యాగును కనిపెట్టి బాధితురాలికి అప్పగించిన పోలీసులు

భువనగిరి క్రైం: ఆర్టీసీ బస్సులో వెళ్తున్న ప్రయాణికురాలి బ్యాగు చోరీకి గురికాగా.. పోలీసులు బ్యాగును కనిపెట్టి బాధితురాలికి అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని అంబర్‌పేట గంగానగర్ కాలనీకి చెందిన గజ్జి జ్యోతి తన భర్త మధుతో కలిసి దసరా పండుగకు తన తల్లిగారి ఊరైన మహబూబ్‌నగర్ జిల్లా కేసనముద్రంకు వెళ్లింది. పండుగ అనంతరం ఈ నెల 14వ తేదీన తిరిగి హైదరాబాద్‌కు వస్తున్న క్రమంలో తొర్రూర్ బస్టాండ్‌లో ఆమె ఆర్టీసీ బస్సు ఎక్కింది. మార్గమధ్యలో తన బ్యాగు కనిపించకపోవడంతో భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ బ్యాగులో 7 తులాల బంగారు ఆభరణాలు ఉన్నట్లు బాధితురాలు పేర్కొంది. పోలీసులు భువనగిరి బస్టాండ్‌లో సీసీ కెమెరాలను పరిశీలించగా.. ఓ ప్రయాణికుడు పొరపాటున తన బ్యాగుకు బదులు బాధితురాలి బ్యాగుతో బస్టాండ్ దిగినట్లు గుర్తించారు. సదరు ప్రయాణికుడు బస్సు దిగిన తర్వాత బ్యాగు తనది కాదని గుర్తించి దానికి బస్టాండ్‌లోనే వదిలో వెళ్లిపోయాడు. ఎవరూ బ్యాగును తీసుకోకపోవడంతో మరో మహిళా ప్రయాణికురాలు ఆ బ్యాగును తన వెంట తీసుకెళ్లింది. ఆ బ్యాగును తీసుకెళ్లిన మహిళను గుర్తించి బ్యాగు, అందులోని బంగారు వస్తువులను స్వాధీనం చేసుకుని సోమవారం బాధితురాలు జ్యోతికి పోలీసులు అప్పగించినట్లు పట్టణ సీఐ కె. సురేష్‌కుమార్ తెలిపారు.

పండుగ ముగిసినా.. ప్రత్యేక చార్జీలే!

- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

మిర్యాలగూడ టౌన్: స్పెషల్ బస్సుల పేరుతో ఆర్టీసీ యాజమాన్యం అధిక చార్జీలు వసూలు చేస్తోందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీ బస్సులో సాధారణంగా ఒక్కరికి రూ.290 చార్జీ ఉండగా.. సోమవారం సూపర్ లగ్జరీ బస్సుకు స్పెషల్ బస్సు అని బోర్డు ఏర్పాటు చేసి రూ.400 వరకు వసూలు చేశారని ప్రయాణికులు మండిపడుతున్నారు. రాజధాని ఏసీ బస్సులో మాత్రం ఎప్పటిలాగే రూ.370 వసూలు చేస్తున్నారని ప్రయాణికులు అంటున్నారు. అంతేకాకుండా మిర్యాలగూడ డిపోకు చెందిన బస్సు నంబర్ ఒకటి ఉంటే టికెట్‌పై మరో నంబర్ ఉండటంతో చర్చనీయాంశంగా మారింది. ఎలాంటి కారణాలు లేకుండా చార్జీలు ఎలా పెంచుతారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణం కల్పించగా.. పల్లె వెలుగు బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డులు ఏర్పాటు చేసి తిప్పుతుండడంతో ఆ బస్సులు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నారు. ఈ విషయంపై మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ రాంమోహన్‌రెడ్డిని వివరణ కోరగా.. మిర్యాలగూడ డిపో నుంచి కేవలం రెండు స్పెషల్ బస్సులు మాత్రమే నడుపుతున్నామని, మిగిలిన బస్సుల్లో సాధారణ చార్జీలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదనంగా బస్సులు వేసినప్పుడు మాత్రమే ఆర్టీసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చార్జీలు పెంచాల్సి వస్తుందని పేర్కొన్నారు.



మిర్యాలగూడ డిపో సూపర్ లగ్జరీ బస్సు స్పెషల్



రూ.400 టిక్కెట్

బిక్కేరు వాగులో ఈతకు వెళ్లి బాలుడు మృతి

నాగారం: సెలవు రోజున సరదాగా స్నేహితులతో కలిసి వాగులోకి ఈతకు వెళ్లిన బాలుడు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి మృతిచెందాడు. ఈ ఘటన నాగారం మండలం వర్ధమానుకోటలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్ధమానుకోట గ్రామానికి చెందిన ఖమ్మంపాటి నాగరాజు, ఉపేంద్ర దంపతులకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు మనీశ్వర్ (11) గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం పాఠశాలకు సెలవు దినం కావడంతో మధ్యాహ్న సమయంలో గ్రామానికి చెందిన మరో ముగ్గురు స్నేహితులతో కలిసి మనీశ్వర్ గ్రామ శివారులోని బిక్కేరు వాగులోకి ఈతకు వెళ్లాడు. బిక్కేరువాగు వద్ద నిర్మించిన చెక్‌డ్యాం వద్ద మనీశ్వర్, అతడి స్నేహితులు ఈత కొడుతుండగా నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో మనీశ్వర్ ఈత రాక నీటిలో కొట్టుకుపోయాడు. తోటి స్నేహితులు భయాందోళనకు గురై విషయం ఎవరికీ చెప్పకుండా ఎవరి ఇంటికి వాళ్లు వెళ్లిపోయారు. సాయంత్రమైనా మనీశ్వర్ ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతకగా ఆచూకీ లభ్యం కాలేదు. మనీశ్వర్ స్నేహితులను ప్రశ్నించగా వారు తమకేమీ తెలియదని చెప్పారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని మనీశ్వర్ స్నేహితులను గట్టిగా అడగడంతో బిక్కేరువాగులో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడని చెప్పారు. దీంతో మనీశ్వర్ తల్లిదండ్రులు, గ్రామస్తులు బిక్కేరు వాగు వద్దకు చేరుకుని ఆదివారం అర్ధరాత్రి వరకు నీటిలో గాలించినా అతడి ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం మరోసారి బిక్కేరు వాగులో గాలించగా మనీశ్వర్ మృతదేహం నీటిపై రాళ్ల మధ్య ఇరుక్కుపోయి కనిపించింది. మృతదేహాన్ని నీటి నుంచి బయటకు తీశారు. పోలీసులు మనీశ్వర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలుడి తండ్రి ఖమ్మంపాటి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నాగారం ఎస్‌ఐ ఎం. ఐలయ్య తెలిపారు.



మనీశ్వర్ (ఫైల్)

అమ్మమ్మ ఇంటి వద్ద అంత్యక్రియలు..

ఖమ్మంపాటి నాగరాజుది రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం. రెండేళ్ల క్రితం తన తండ్రికి యాదగిరికి రెండు కిడ్నీలు చెడిపోవడంతో గ్రామంలో ఉన్న ఇళ్లు, ఎకరం పొలం అమ్మి వైద్యం చేయించగా అతడు చనిపోయాడు. అప్పటి నుంచి అద్దె ఇంట్లోనే ఉంటున్నారు. నాగరాజు వైన్ షాపులో పనిచేస్తుండగా, అతడి ఉపేంద్ర కూలీ పనులు చేస్తూ తమ ముగ్గురు పిల్లల్ని చదివిస్తున్నారు. ఇంతలోనే తమ పెద్ద కుమారుడు మనీశ్వర్ ఈతకు వెళ్లి మృత్యువాత పడటంతో వారి రోదనలు మిన్నంటాయి. కిరాయి ఇంట్లో అంత్యక్రియలు చేయలేని పరిస్థితి ఉండటంతో మనీశ్వర్ అమ్మమ్మ గ్రామమైన నాగారం బంగ్లాలో అంత్యక్రియలు నిర్వహించారు.

స్నేహితుడి పెళ్లి ఊరేగింపులో డ్యాన్స్ చేసి..

- ఇంటికొచ్చి నిద్రలోనే గుండెపోటుతో యువకుడి మృతి

నడిగూడెం : స్నేహితుడి పెళ్లి ఊరేగింపులో డ్యాన్స్ చేసి ఆ తర్వాత ఇంటికి వెళ్లి పడుకొని నిద్రలోనే గుండెపోటుతో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం సిరిపురంలో సోమవారం తెల్లవారు జామున జరిగింది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కేసగాని ఉపేందర్ కుమారుడు కేసగాని సతీష్ (27) తన స్నేహితుడి పెళ్లి ఊరేగింపులో ఆదివారం రాత్రి 11 గంటల వరకు పాల్గొన్నాడు. డీజే చప్పుడుకు డ్యాన్స్ కూడా చేశాడు. ఆ తర్వాత ఇంటికి వెళ్లి పడుకున్నాడు. తల్లి సీతారాములమ్మ సోమవారం తెల్లవారు జామున 5గంటల సమయంలో కొడుకును నిద్రలేపడానికి ప్రయత్నించగా లేవలేదు. తన భర్తతో పాటు చుట్టుపక్కల వారిని పిలిచి పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. మృతునికి భార్య, ఏడాదిన్నర చిన్నారి ఉంది. అతని భార్య లిఖిత దసరా పండుగకు పుట్టింటికి వెళ్లి ఇంకా రాలేదు. సోమవారం వెళ్లి తన భార్యను తీసుకురావాలనుకున్నాడు.



సతీష్ (ఫైల్)

బాలసదన్ ఘటనపై కేసు నమోదు

భువనగిరి క్రైం: భువనగిరిలోని బాలసదన్‌లో అనాథ బాలికపై జరిగిన లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు భువనగిరి పట్టణ సీఐ సురేష్‌కుమార్ తెలిపారు. వలిగొండలోని శాంతినిలయంలో ఉంటూ చదువుకుంటున్న అనాథ బాలిక(13) దసరా సెలవుల్లో తాత్కాలిక ఆశ్రయం కోసం భువనగిరిలోని బాలసదన్‌కు వచ్చింది. ఈ నెల 14న బాలసదన్‌లో అంతర్జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించగా.. వేడుకలు జరుగుతున్న సమయంలో బాలిక బాత్‌రూంకు వెళ్లి వస్తుండగా డీఎల్‌ఎస్‌ఏ అటెండర్ వెంకట్‌రెడ్డి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక బాలసదన్ సిబ్బందికి విషయం చెప్పగా.. సోమవారం జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి వెంకట్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని జ్యూడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు సీఐ పేర్కొన్నారు.

కలెక్టర్ వినతి..

భువనగిరిటౌన్: బాలికపై జరిగిన లైంగిక దాడిపై సమగ్ర విచారణ జరిపి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జండగేకు బాలల హక్కుల పరిరక్షణ వేదిక, హ్యూమన్ రైట్స్ కమిషన్, ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా నాయకుడు కొడారి వెంకటేష్, నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు ఇంతియాజ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పల శాంతికుమార్, లోకేష్ తదితరులు ఉన్నారు.



యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

7 గేట్ల ద్వారా పులిచింతల నీటి విడుదల

హుజూర్‌నగర్: పులిచింతల ప్రాజెక్టుకు వస్తున్న వరద ఉధృతి స్వల్పంగా తగ్గింది. ఆదివారం 2.22లక్షల క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో సోమవారం 1.83లక్షల క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్టు 7 క్రస్ట్ గేట్లను 3 మీటర్లు పైకిఎత్తి 1.67 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 16వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 42.16 టీఎంసీల నీరు ఉంది.

100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి..

పులిచింతల ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మించిన తెలంగాణ జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలోని నాలుగు యూనిట్ల ద్వారా సోమవారం 100 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లు జెన్‌కో ప్రాజెక్టు ఎస్‌ఈ దేశ్యానాయక్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మద్దిరాల: గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మద్దిరాల మండల కేంద్రంలోని 365వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లా మండలం బునాలపురం గ్రామానికి చెందిన ఆంబోతుల ప్రశాంత్(27) నూతనకల్ మండలం తానంచర్లలోని పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి పని ముగించుకుని తన అత్తగారి ఊరైన మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం అమ్మపురం గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా.. మద్దిరాల మండల కేంద్రంలోని 365వ నంబర్ జాతీయ రహదారిపై భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రశాంత్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు.

ప్రభుత్వాస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

నల్లగొండ క్రైం: నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలోని అన్నపూర్ణ క్యాంటిన్ వద్ద సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 32 సంవత్సరాలు ఉంటుందని, చామన ఛాయ రంగులో ఉన్నాడని పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712670176ను సంప్రదించాలని సూచించారు.



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

బలమైన బాల్యానికి.. పంచసూత్రాలు

- పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని అధిగమించేలా కార్యాచరణ
- అంగన్‌వాడీల్లో వెయ్యి రోజుల ప్రణాళిక

మిర్యాలగూడ టౌన్ : పిల్లల్లో పౌష్టికార లోపాన్ని నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. అంగన్‌వాడీల ద్వారా ఇప్పటికే గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. అదే క్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నా కొందరు చిన్నారులు పౌష్టికాహారం లోపంతో బాధపడుతున్నారు. వారికి సంపూర్ణ ఆరోగ్యులుగా తీర్చిదిద్దేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేకంగా వెయ్యి రోజుల కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. చిన్నారుల అభ్యున్నతికి పంచ సూత్రాల అమలుకు శ్రీకారం చుట్టింది. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగానే దీన్ని అమలు చేస్తోంది.



తడకమళ్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

పంచసూత్రాలు ఇలా..

- పుట్టిన బిడ్డకు ఆరు నెలల పాటు తల్లి ముర్రుపాలు, ఆరు నెలల తరువాత అదనపు ఆహారాన్ని అందించడం, అదే విధంగా సమయానికి వ్యాధి నిరోధక టీకాలను వేయించేలా చూస్తున్నారు. పోషణ లోపం కలిగిన చిన్నారులకు ఆకుకూరలు తదితర సమతుల్య ఆహారం అందిస్తున్నారు.
- బాల్యదశలోనే సమతుల్య ఆహారాన్ని అందించకపోతే ఎదురయ్యే ఇబ్బందులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు ఇంటి వద్ద కూడా ఎలాంటి ఆహారాన్ని తీసుకోవాలో తెలియజేస్తున్నారు.
- కొంతమంది చిన్నారుల్లో రక్తహీనత సమస్య తలెత్తుతుంది. ఇలాంటి వారిని గుర్తించి పౌష్టికాహారాన్ని అందిస్తారు.
- కలుషిత నీరు, ఆహారం తదితర కారణాలతో చిన్నారులు డయేరియా బారినపడుతున్నారు. ఫలితంగా శారీరక ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. నిర్లక్ష్యం వహిస్తే పరిస్థితి చేయిదాటే ప్రమాదం లేకపోలేదు. ఈ తరుణంలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలు, ఒకవేళ అతిసారం బారిన పడితే ముందడుగు వేయాల్సిన తీరుపై సూచనలు చేస్తున్నారు.
- శుచి, శుభ్రతను పాటించకపోతే రోగాలు ప్రబలే అవకాశం ఎక్కువ. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉంటుంది. చేతుల శుభ్రతతో ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ చిన్నారులు తరుచూ చేతులు శుభ్రం చేసుకునేలా ప్రోత్సహిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఆరేళ్లలోపు పిల్లల వివరాలు ఇలా..

జిల్లా	ప్రాజెక్టులు	కేంద్రాలు	పిల్లలు
నల్లగొండ	9	2093	85,788
సూర్యాపేట	5	1209	43,962
యాదాద్రి	4	901	34,777

పక్కాగా అమలు చేస్తున్నాం

చిన్నారుల ఆరోగ్యంగా ఎదగాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పంచ సూత్రాలు పకడ్బందీగా అమలయ్యేలా చూస్తున్నాం. పోషకలోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.

– కృష్ణవేణి, జిల్లా స్త్రీ,శిశు సంక్షేమశాఖ అధికారి, నల్లగొండ

